సాక్షి రాజన్న సిరిసిల్ల

శనివారం । 3 । ఫిబ్రవరి । 2024



ఉపాధిహామీ దినోత్సవం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): అంకుషాపూర్‌లో శుక్రవారం డీఆర్‌డీవో పీడీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపాధిహామీ దినోత్సవం నిర్వహించారు. ఏపీడీ నర్సింలు, హెచ్ఆర్ నాగరాజు ఉన్నారు.



పాఠశాల తనిఖీ

వేములవాడఅర్బన్: రుద్రవరంలోని హైస్కూల్‌ను డీఈవో రమేశ్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ శైలజ, హెచ్ఎం మాధవి ఉన్నారు.

గరిష్టం/కనిష్టం
33.0/20.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పల్లెల్లో కొలువుదీరిన ప్రత్యేకాధికారులు



సిరిసిల్ల: జిల్లాలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేకాధికారులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గ్రామపంచాయతీల పాలకవర్గాల పదవీకాలం గురువారంతో ముగియడంతో జిల్లాలోని 255 గ్రామాలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామపంచాయతీ రికార్డులను ప్రత్యేకాధికారులకు అప్పగించారు. ఈమేరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో స్పెషల్ ఆఫీసర్లు విధుల్లో చేరినట్లు జిల్లా పంచాయతీ అధికారి రవీందర్‌కు నివేదికలు అందాయి.

పిల్లలకు ఆరోగ్యకర జీవితం అందిద్దాం



సిరిసిల్లటౌన్: పిల్లలకు ఆరోగ్యవంతమైన జీవితాన్ని అందిద్దామని జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో బి.శ్రీరాములు కోరారు. సిరిసిల్లలోని డీఎంహెచ్‌వో ఆఫీసులో శుక్రవారం నిర్వహించిన జాతీయ నులిపురుగుల దినోత్సవంలో మాట్లాడారు. ఫిబ్రవరి 12 నుంచి 17 వరకు జిల్లావ్యాప్తంగా వార్మింగ్ డే(జాతీయ నులిపురుగుల నివారణ) దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నులి పురుగులతో 19 ఏళ్లలోపు పిల్లలు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. రక్తహీనత, పోషకారలోపం, ఆకలి మందగించడం, బలహీనత, కడుపునొప్పి వంటి సమస్యలు వస్తున్నాయన్నారు. వైద్యులు ఎస్.రజిత, నయీమా, ఆర్‌బీఎస్‌కే సీహెచ్‌వోలు ప్రతాపరెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్, బాలయ్య పాల్గొన్నారు.

నివేశన స్థలాలు ఇవ్వండి



గంభీరావుపేట(సిరిసిల్ల): ఆక్రమణకు గురైన తమ భూమిని ఇళ్ల స్థలాలుగా తమకే ఇప్పించాలని కోరుతూ గంభీరావుపేట మండలం నాగంపేట దళితులు శుక్రవారం తహసీల్దార్ ఆఫీస్ ఎదుట ధర్నా చేశారు. 1980, 1996లో అప్పటి ప్రభుత్వం దళితులకు 92/ఏ సర్వే నంబర్‌లో భూమిని నివేశన స్థలాలుగా ఇచ్చిందన్నారు. కొందరు ఆ స్థలాన్ని ఆక్రమించుకుని, బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి అక్రమంగా చేసుకున్న పట్టాలు రద్దు చేసి తమకు నివేశన స్థలాల కోసం ఇవ్వాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వాహనదాలు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జిల్లా మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కిశోర్ చంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రాచర్లగొల్లపల్లిలోని జ్ఞానదీప్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. హెల్మెట్ ధరించకపోవడంతోనే ప్రమాదాల్లో చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. కారులో వెళ్లే సమయంలో సీటుబెల్టు ధరించాలని సూచించారు. హెచ్ఎం లక్ష్మీనారాయణ, జిల్లా డ్రైవింగ్ స్కూల్ యూనియన్ అధ్యక్షుడు బాబు, సురేష్, రాజు పాల్గొన్నారు.

ఇంటింటికీ రామమందిర చిత్రపటాలు



ముస్తాబాద్(సిరిసిల్ల): అయోధ్య భవ్య రామమందిర చిత్రపటాలను ఇంటింటికి పంపిణీ చేస్తామని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మల్లారపు సంతోష్‌రెడ్డి పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో రామమందిర చిత్రపటాల పంపిణీని శుక్రవారం ప్రారంభించారు. బీజేపీ మండలాధ్యక్షుడు మేరుగు అంజాగౌడ్, మండల ఉపాధ్యక్షుడు క్రాంతికుమార్, నాయకులు రమేశ్, సంజీవ్, శంకర్, పద్మ, వెంకన్న, వెంకటేశ్, మహేందర్, రాజు పాల్గొన్నారు.

జనావాసాల్లో విషవనాలు

- జిల్లాలో నిషేధిత కోనోకార్పస్
- ఎక్కడ చూసినా ఆ మొక్కలే..
- ముప్పంటే తొలగించాలన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- పట్టించుకోని జిల్లా అధికారులు



ఇది సిరిసిల్ల పట్టణ నడిబొడ్డున గాంధీచౌక్‌లో రోడ్డు డివైడర్‌పై ఉన్న కోనోకార్పస్ చెట్లు. ఈ చెట్ల ఆకులు పశువులు తినవు. ఈ చెట్ల కొమ్మలపై పక్షులు వాలవు. కారణం ఇవి విషవృక్షాలు. ఈ చెట్లకాయల పుప్పొడితో శ్వాసకోస వ్యాధులు వస్తాయి. ప్రపంచ దేశాలు ఈ మొక్కను నాటడాన్ని నిషేధించాయి. కానీ జిల్లాలో హరితహారంలో భాగంగా ఈ కోనోకార్పస్ మొక్కలను రోడ్ల డివైడర్లపై నాటారు. ఒక్క సిరిసిల్ల పట్టణంలోనే కాదు.. పల్లెల్లోనూ అవెన్యూప్లాంటేషన్‌లో భాగంగా మూడేళ్ల క్రితం విషపు మొక్కలను నాటారు. ఆనాటి మొక్కలు ఇప్పుడు చెట్లుగా పెరిగి పూలు పూసి, కాయలు కాసి విషవనాలుగా మారాయి. ఇలా జిల్లాకేంద్రంతోపాటు జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లోనూ విషవనాలు విస్తరించాయి.

మంచివి కాకుంటే తొలగించండి



'జిల్లాలోని రోడ్ డివైడర్లపై నాటిన మొక్కలు మంచివి కావని, వాటిని ప్రభుత్వం నిషేధించింది. కానీ జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో కనిపిస్తున్నాయి. సమాజానికి చెడు చేసేవి అయితే.. వాటిని తొలగించి మంచి మొక్కలు నాటండి..' అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జిల్లా అధికారులకు సూచించారు. జనవరి 7న జిల్లా అభివృద్ధి సమీక్షలో ఈమేరకు ఆదేశాలు జారీ చేశారు. అయితే ఇప్పటి వరకు జిల్లా యంత్రాంగం ఒక్క మొక్కనూ తొలగించలేదు.

సిరిసిల్ల: హరితహారంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు బాటలు వేశారు. ఈ మంచి పనిలో తెలియకుండానే విషపు మొక్కలను నాటారు. ప్రపంచ దేశాలు ఈ కోనోకార్పస్ మొక్కలను ఏనాడో నిషేధించగా.. రాష్ట్రంలో అంతటా నాటిన తరువాత 2022 జూన్ 15న కోనోకార్పస్ మొక్కలపై నిషేధం విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అప్పటికే వేలాది మొక్కలను నాటేశారు. అందంగా ఉన్నాయని మొక్కే కదా అని అంతటా వదిలేశారు. ఫలితంగా ఆ విషవనాలు ఇప్పుడు చెట్లుగా మారి, పూలు పూసి, కాయలు కాసి సమాజానికి విషగుళికగా మారి వాయుకాలుష్య కారకంగా నిలుస్తోంది. మూడేళ్ల క్రితం పోటీపడి మరీ ఈ మొక్కలను తెప్పించి నాటడం విశేషం. పట్టణాల్లోనూ కాదు పల్లెల్లోనూ విషవనాలు వృక్షాలుగా మారాయి.

పర్యావరణానికి పెను ముప్పు

జిల్లా వ్యాప్తంగా విరివిగా నాటిన ఈ మొక్కలు కోనోకార్పస్ కంబ్రాటేసీ కుటుంబానికి చెందినది. ఈ మొక్క ఎందుకూ పనికిరాదు. కీటకాలు సైతం ఈ మొక్క దరిచేరవు. వీటి నీడలో పచ్చిగడ్డి కూడా పెరగదు. భూగర్భ జలాలను ఎక్కువగా తీసుకుంటుంది. ఈ చెట్ల వేర్లకు అడ్డువస్తే పైపులైన్లు, కేబుల్ వైర్లను సైతం చీల్చుకుని వెళ్తాయి. ప్రతికూల పరిస్థితుల్లోనూ ఏపుగా పెరుగుతాయి. వాస్తవానికి సముద్రతీర ప్రాంతాల్లో పెరిగే ఈ మొక్కలను పట్టణాల్లోకి తెచ్చి జనావాసాల్లో నాటారు. ఈ మొక్కల కాయల్లోని పుప్పొడి గాలిలో కలిసి ఆస్తమా, అలర్జీ, శ్వాసకోశ వ్యాధులకు కారణమవుతున్నాయని వృక్షశాస్త్ర నిపుణులు చెబుతున్నారు.

దుష్పరిణామాలు ఉంటాయి



ఇతర ఏ మొక్కలతోనూ ఇలాంటి ఇబ్బందులు ఉండవు. కోనోకార్పస్ మొక్కల పుప్పొడితో దుష్పరిణమాలు ఉంటాయి. ఆ మొక్కల పుప్పొడితో ఆస్తమా, అలర్జీ సమస్యలు వస్తాయి. కోనోకార్పస్ మొక్కలపై అనేక పరిశోధనలు చేసి వాటిని నిషేధించారు. వాటితో లాభాల కంటే అనర్థాలే ఎక్కువ.

– డాక్టర్ అన్నాడి చందనరెడ్డి, పల్మనాలజిస్ట్, సిరిసిల్ల

కొమ్మలు కత్తిరిస్తాం



సిరిసిల్లలోని డివైడర్లపై నాటిన కోనోకార్పస్ మొక్కలు ఇప్పుడు పెద్దగా పెరిగాయి. ఆ చెట్ల కొమ్మలను కత్తిరించాలని నిర్ణయించాం. ప్రూనింగ్ (కొమ్మకొట్టడం) చేస్తే చెట్లకాయలు తొలగిపోతాయి. ఆ చెట్లతో వాయుకాలుష్యం కాకుండా ఉంటుంది. ప్రూనింగ్ చేయిస్తాం.

– ఆయాజ్, మున్సిపల్ కమిషనర్, సిరిసిల్ల

భూముల వివరాలు పక్కాగా ఉండాలి

- ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- వేసవిలో నీటి సమస్య రాకుండా చర్యలు
- కలెక్టర్ అనురాగ్ జయంతి



జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: ప్రభుత్వ భూముల వివరాలు పక్కాగా ఉండాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా స్థాయి అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ భూముల సమగ్ర సమాచారం సేకరించాలని, ఖాళీ స్థలాలు ఎన్ని ఎకరాలు ఉన్నాయో రికార్డుల్లో ఉండాలని, వాటిని క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలన్నారు. ఆక్రమణలు ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

నీటి ఇబ్బందులు రానీయొద్దు

నీటిశుద్ధి నుంచి.. ఇంటింటికీ సరఫరా వరకు.. జిల్లాలోని మున్సిపాలిటీలు, అన్ని గ్రామాల్లోనూ వేసవిలో నీటిసమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మిషన్‌భగీరథ అధికారులకు సూచించారు. నీటి సరఫరాలో క్షేత్రస్థాయిలో ఇబ్బందులుంటే సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించారు. మధ్యమానేరు జలాశయంలో నీటి నిల్వలపై కలెక్టర్ ఆరా తీశారు. నీటి సరఫరా, సమస్యల పరిశీలనకు జిల్లా అధికారులతో కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు.

టెక్స్‌టైల్ పార్క్‌పై సమీక్ష

టెక్స్‌టైల్ పార్క్‌లో మొత్తం 116 పరిశ్రమలు అనుమతి పొందాయని, ప్రస్తుతం 62 కొనసాగుతున్నాయని ఆర్‌డీడీ అశోక్‌రావు వివరించారు. మధ్యమానేరు వద్ద చేపపిల్లల పెంపకం, కావాల్సిన స్థలం, ఇతర అంశాల గురించి మత్స్యశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. తంగళ్లపల్లి మండలం పద్మనగర్ శివారులో చేపడుతున్న కేంద్రీయ విద్యాలయం భవన పనుల పురోగతిపై ఆరా తీశారు. వైద్యకళాశాలలో క్రిటికల్ కేర్ యూనిట్, క్వార్టర్ల నిర్మాణాలకు కావాల్సిన భూమిని సేకరించాలని సిరిసిల్ల ఆర్డీవోను ఆదేశించారు. అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఎన్.ఖీమ్యానాయక్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు ఆనంద్‌కుమార్, మధుసూదన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగయ్య, టెక్స్‌టైల్ పార్క్ ఆర్‌డీడీ అశోక్‌రావు, మిడ్‌మానేర్ ఈఈ జగన్, జౌళిశాఖ ఏడీ సాగర్, మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ జానకి, గ్రిడ్ ఈఈ విజయ్‌కుమార్, సీపీవో పీబీ శ్రీనివాసాచారి, డీపీవో రవీందర్, డీఈవో రమేశ్‌కుమార్, ఆర్అండ్‌బీ ఈఈ శ్యామ్‌సుందర్, మత్స్యశాఖ అధికారి శివప్రసాద్, ఇరిగేషన్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఉపాధి కల్పనాధికారి రాఘవేందర్, మున్సిపల్ కమిషనర్లు ఆయాజ్, అన్వేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల తనిఖీ పకడ్బందీగా చేపట్టాలి

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)ల తనిఖీ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ఈవీఎం, వీవీప్యాట్‌ల అవగాహన ప్రదర్శన కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికలకు అవసరమైన సామగ్రిని తెప్పించాలని, ఓటరు జాబితాను మరోసారి పరిశీలించాలని, డబుల్ ఓట్లు, తప్పులు ఉండొద్దని స్పష్టం చేశారు. బీఎల్‌వోలతో ఇంటింటికీ తిరిగి జాబితాను సిద్ధం చేయాలని, రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

నిబంధనలు పాటించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

సిరిసిల్లక్రైం: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని ఎస్పీ అఖిల్ మహాజన్ కోరారు. 35వ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక అంబేడ్కర్‌చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ఇష్టారీతిగా వాహనాలు నడిపి, ప్రమాదాలకు గురికావద్దని సూచించారు. విద్యార్థి దశ నుంచి రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు వివరించేందుకు పాఠశాలలో రోడ్డు సేఫ్టీ ఎడ్యుకేషన్ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మద్యం సేవించి, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపొద్దని సూచించారు. ట్రెయినీ ఎస్పీ రాహుల్‌రెడ్డి, ట్రాఫిక్ ఎస్సై రాజు, అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, సీఐ రఘుపతి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరించిన ఎస్పీ

వేములవాడరూరల్: వేములవాడరూరల్ మండలం నాగాయపల్లిలో దుబ్బరాజన్న ఆలయంలో ఈనెల 8, 9 తేదీల్లో జరిగే దుబ్బ రాజేశ్వరస్వామి జాతర మహోత్సవ పోస్టర్‌ను ఎస్పీ అఖిల్ మహాజన్ చేతుల మీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. 8న మాఘ అమావాస్య, 9న శివ కల్యాణం, రథోత్సవం నిర్వహించనున్నారు. బండి కొండయ్య, అచ్చ శంకర్, గుంటి కొమురయ్య, మాసం విష్ణు, బండి రజనీకాంత్ తదితరులు ఉన్నారు.

గంజాయి సమాచారం ఇవ్వండి

సిరిసిల్లక్రైం: గంజాయి అమ్ముతూ యువకులను పెడదారి పట్టించి డబ్బులు సంపాదించాలని ఆలోచిస్తున్న వ్యాపారుల గురించి, గంజాయి సేవించే వారి వివరాలను అందించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ శుక్రవారం ప్రకటనలో కోరారు. 63039 22572 నంబర్‌కు సమాచారం తెలపాలని దానిని స్వయంగా ఎస్పీ పరిశీలించి వివరాలను గోప్యంగా ఉంచి నిందితులపై కఠిన చర్యలకు వెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

వేములవాడ ఏరియా ఆస్పత్రికి ఎన్‌క్వాస్

- అత్యుత్తమ వైద్యసేవలకు దక్కిన గుర్తింపు
- హర్షం వ్యక్తం చేసిన కలెక్టర్ అనురాగ్ జయంతి



వేములవాడ ఏరియా ఆస్పత్రి

వేములవాడఅర్బన్: వేములవాడ ఏరియా ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న వైద్యసేవలకు తగిన గుర్తింపు లభించింది. ఆస్పత్రిలోని అన్ని విభాగాల మెరుగైన నిర్వహణకు వేములవాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి కేంద్ర ప్రభుత్వం శుక్రవారం నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్(ఎన్‌క్వాస్) సర్టిఫికెట్ అందించింది. కేంద్ర బృందం గత అక్టోబర్‌లో ఈ ఆస్పత్రిని పరిశీలించారు. ఆస్పత్రిలోని ఫార్మసీ, ఓపీడీ, అడ్మిన్, రేడియాలజీ, ఎమర్జెన్సీ, ఐపీడీ, ఓటీ, ల్యాబ్, మెటర్నిటీవార్డ్‌లలో అంది స్తున్న సేవలకు ఎన్‌క్వాస్ సర్టిఫికేషన్, లేబర్ రూమ్ మెరుగైన నిర్వహణకు సర్టిఫికెట్ లభించింది. అలాగే పిడియాట్రిక్ విభాగంలో ఉత్తమ వైద్యసేవలు అందించినందుకు ముస్కాన్ సర్టిఫికేట్ దక్కింది.

రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ హర్షం

వేములవాడ ఏరియా ఆస్పత్రికి ఎన్‌క్వాస్ గుర్తింపు పొందినందుకు కలెక్టర్ అనురాగ్ జయంతి హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలో వైద్య ప్రమాణాలు మెరుగయ్యాయని చెప్పడానికి ఇది మరో నిదర్శనమని పేర్కొన్నారు.

ఆలయాలే టార్గెట్



ఇది ముస్తాబాద్ మండల కేంద్రంలోని ఆర్టీసీ డ్రైవర్ వెంకటేశ్ ఇంట్లో దొంగలు చిందరవందర చేసిన వస్తువులు. పదిహేను రోజుల క్రితం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి వెళ్లారు. ఇదే అదనుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి వేళ ఇంటి తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువాను ధ్వంసం చేసి అందులో దాచి ఉంచిన 7 తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.60వేల నగదు ఎత్తుకెళ్లారు.

- వరుస దొంగతనాలు
- చిక్కని దొంగలు
- పనిచేయని సీసీ కెమెరాలు
- వలసకార్మికులపైనే అనుమానాలు
- వేలిముద్రలు సేకరిస్తున్న పోలీసులు
- భయాందోళనలో ప్రజలు



ముస్తాబాద్‌లోని వెంకటేశ్ ఇంట్లో దొంగలు పడ్డ తర్వాత పరిస్థితి ఇలా..



ఇది ముస్తాబాద్ మండలం చీకోడులోని ఎల్లమ్మ ఆలయం. పదిహేను రోజుల క్రితం దొంగలు తాళాలు పగులగొట్టి ఎల్లమ్మ అమ్మవారికి సంబంధించిన పుస్తెలతాడు, కమ్మలు, హుండీలోని నగదును ఎత్తుకెళ్లారు. మరుసటి రోజే ఇదే మండలంలోని సమీప గ్రామమైన మద్దికుంట పెద్దమ్మ ఆలయంలో చొరబడి హుండీ, అమ్మవారి పూజకు ఉపయోగించే గంట, ఇతర సామగ్రిని ఎత్తుకెళ్లారు.

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లాలో ఇటీవల ఆలయాలను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడుతున్నారు. గ్రామ శివారులోని ఆలయాలు, జనావాసాల మధ్య ఉన్న గుళ్లల్లోనూ చోరీలకు పాలపడుతున్నారు. అదే సమయంలో తాళం వేసి ఉన్న ఇళ్లను వదలడం లేదు. ఇటీవల జిల్లాకు వలస కార్మికుల రాక పెరగడం.. అదే సమయంలో చోరీలు పెరుగుతుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. పట్టపగలే ఇళ్లను టార్గెట్ చేసుకొని రెక్కి నిర్వహిస్తూ పథకం ప్రకారం ఉన్నదంతా దోచుకెళ్తున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. ఫలితంగా దొంగల ఆచూకీ చిక్కడం లేదు. గ్రామాల్లో వ్యవసాయ పనులు జోరందుకోవడంతో పొద్దంత తాళాలు వేసి ఉండడం దొంగలకు కలిసొస్తుంది. ఇటీవల ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, గంభీరావుపేట, తంగళ్లపల్లి మండలాల్లోని ఆలయాలు, తాళం వేసిన ఇళ్లల్లో దొంగతనాలు జరిగాయి. లక్షల విలువైన బంగారు ఆభరణాలు, భక్తుల ద్వారా వచ్చిన కానుకలు చోరీకి గురయ్యాయి. పోలీస్‌స్టేషన్లకు కూతవేటు దూరంలో ఉన్న ఆలయాల్లోనూ దొంగతనాలు జరగడం గమనార్హం.

పనిచేయని సీసీ కెమెరాలు

జిల్లా వ్యాప్తంగా 255 గ్రామపంచాయతీల్లో సుమారు 70 శాతం గ్రామాలలో ప్రజలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. కెమెరాల నిర్వహణపై పట్టింపు లేకపోవడంతో సగానికి పైగా సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. జిల్లాలో 1200లకు పైగా సీసీ కెమెరాలను గతంలో ఏర్పాటు చేశారు. అయితే ఇందులో వెయ్యికి పైగా సీసీ కెమెరాలు పనిచేయడం లేదని అధికారులు చెబుతున్నారు. దాని ఫలితంగానే నేడు వరుసదొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను త్వరగా పట్టుకోలేకపోతున్నామని పోలీసులు పేర్కొంటున్నారు.

వేలిముద్రల సేకరణలో పోలీసులు

ఇటీవల జిల్లాకు ఇతర రాష్ట్రాల నుంచి వలస కార్మికుల రాక పెరిగింది. జిల్లాలో భవన నిర్మాణాల పనులు ముమ్మరం కావడం, వ్యవసాయ పనులు సైతం ఊపందుకోవడం, కోళ్లషెడ్లలో పనిచేసేందుకు స్థానికంగా కూలీల కొరతతో చాలా మంది మధ్యవర్తులు ఇతర రాష్ట్రాలు బిహార్, ఉత్తర్‌ప్రదేశ్, ఒడిశాల నుంచి వేలకొలది కార్మికులను కాంట్రాక్టుపై ఇక్కడికి తీసుకొస్తున్నారు. అయితే కాంట్రాక్టర్లు ఇక్కడి అధికారులకు వారి వద్ద ఉన్న కూలీల సమాచారం ఇవ్వడం లేదు. వరుసగా దొంగతనాలు జరుగుతుండడంతో అపరిచిత వ్యక్తుల సంచారం పెరగడంతో వారిపై పోలీసులు నిఘా పెట్టారు. అంతేకాకుండా గత పదిహేను రోజులుగా జిల్లాలో జరుగుతున్న దొంగతనాల నేపథ్యంలో వలసకూలీల వివరాలు సేకరిస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో వలసకూలీల వివరాలతో కూడిన జాబితాను తయారు చేయడమే కాకుండా వేలిముద్రలు సేకరిస్తున్నారు. దొంగతనాలు జరిగిన సందర్భాల్లో వలసకార్మికుల వేలిముద్రలతో పోల్చి నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు.



ఇది ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సద్దిమద్దుల సంఘం భవనం పక్కనున్న ఆంజనేయస్వామి ఆలయం. రెండు రోజుల క్రితం పూజారి సాయంత్రం ఆలయానికి తాళాలు వేసి ఇంటికెళ్లాడు. దొంగలు అర్ధరాత్రి ఆలయం తాళాలను పగులగొట్టి లోనికి ప్రవేశించి హుండీలోని నగదు ఎత్తుకెళ్లారు.

నిఘా తీవ్రం చేశాం



వరుస దొంగతనాల నేపథ్యంలో నిఘా తీవ్రం చేశాం. ఎల్లారెడ్డిపేటలోని శివాలయం, ఆంజనేయస్వామి ఆలయాల్లో ఇటీవల జరిగిన దొంగతనంపై విచారణలో భాగంగా వేలిముద్రలు సేకరించాం. మండల కేంద్రంలోని కొన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు లేకపోవడంతో నిందితులు సులభంగా తప్పించుకుంటున్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. అపరిచిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

– రమాకాంత్, ఎల్లారెడ్డిపేట ఎస్సై

క్లుప్తంగా

సీసీఎల్ శిక్షణకు రాయికల్ ఉపాధ్యాయులు


అభయ్‌రాజ్


మహేశ్

రాయికల్(జగిత్యాల): రాయికల్ మండలం రామారావుపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కడకుంట్ల అభయ్‌రాజ్, భూపతిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మ్యాథ్స్ టీచర్ సిరిపురం మహేశ్ గుజరాత్‌లోని ఐఐటీ గాంధీనగర్‌లో సెంటర్ ఫర్ క్రియేటీవ్ లర్నింగ్ (సీసీఎల్) శిక్షణకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారికి అప్లికేషన్ ఒరియంటెడ్ అండ్ కాంటెక్స్ డ్రైవెన్ లర్నింగ్ అంశంపై నాలుగు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను పలువురు అభినందించారు.

బట్టల దుకాణంలో అగ్ని ప్రమాదం



కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండల కేంద్రంలోని సుమంగళి క్లాత్‌స్టోర్‌లో శుక్రవారం వేకువజామున అగ్ని ప్రమాదం జరిగింది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. వేకువజామున 5 గంటలకు యజమాని సంతోష్‌గౌడ్ దుకాణంలో మంటలను గమనించాడు. వెంటనే షట్టర్ ఓపెన్ చేసి చుట్టుపక్కలవారి సాయంతో మంటలను ఆర్పారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల విలువైన బట్టలు కాలిపోయినట్లు బాధితుడు తెలిపాడు.

ప్రశాంతంగా పరీక్షలు రాయాలి

- అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ విక్రాంత్



వేములవాడఅర్బన్: వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ విక్రాంత్ సూచించారు. వేములవాడలోని బోయినపల్లి గురుకుల పాఠశాలలో ఇంటర్, పదోతరగతి వార్షిక పరీక్షలకు హాజరైన విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరీక్షలు రాసే విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిడికిలోను కాకుండా చూసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సూర్యప్రకాశ్, వైస్‌ప్రిన్సిపాల్ శ్రీదేవి ఉన్నారు.

చేపల పెంపకం.. ఉపాధి నమ్మకం

- మిడ్‌మానేరు నిర్వాసిత గ్రామాల్లో కేజ్‌కల్చర్‌తో ఉపాధి బాటలు
- మత్స్యకార్మికులకు సబ్సిడీపై యూనిట్లు
- ఒక్కో యూనిట్ విలువ రూ.3 లక్షలు
- త్వరలోనే అవగాహన సదస్సులు
- తీరనున్న నిర్వాసితుల ఉపాధి కష్టాలు


కేజ్ కల్చర్ విధానంలో చేపల పెంపకం (ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు ముంపు గ్రామాల్లోని మత్స్యకార్మికులకు ఉపాధి కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కేజ్ కల్చర్ విధానంలో చేపల పెంపకంపై అవగాహన కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇటీవల రవాణా, బీసీసంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లా పర్యటనకు వచ్చిన సమయంలో మిడ్‌మానేరు నిర్వాసితుల ఉపాధి విషయాన్ని విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం ప్రస్తావించగా.. ఈమేరకు అధికారులను ఆదేశించారు. రెండు, మూడు రోజుల్లోనే అవగాహన సదస్సులు నిర్వహిస్తామని జిల్లామత్స్యశాఖాధికారి శివప్రసాద్ తెలిపారు.

మిడ్‌మానేరులో 12 గ్రామాలు..

మిడ్‌మానేరు ప్రాజెక్టు నిర్మాణంలో బోయినపల్లి, వేములవాడ, ఇల్లంతకుంట, తంగళ్లపల్లి మండలాల్లోని 12 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లోని మత్స్యకార్మిక కుటుంబాలకు మాత్రమే కేజ్ కల్చర్ యూనిట్ వర్తిస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రాజెక్టులు కలుపుకుని జిల్లాలో 440 వరకు చేపలు పెంచే చెరువులు ఉన్నాయి. 8,400 మత్స్యకార్మికులు, 135 సొసైటీలు ఉన్నాయి. ముంపు గ్రామాల్లో 1600 మంది లైసెన్స్ గల మత్స్యకార్మికులు ఉన్నారు.


కేజ్ కల్చర్‌లో పెరిగిన చేపలను బాక్సుల్లో తరలిస్తున్న కార్మికులు (ఫైల్)

సబ్సిడీ రుణాలు

మిడ్‌మానేరు ప్రాజెక్టు పునరావాసకాలనీల్లోని మత్స్యకార్మికులకు కేజ్ కల్చర్ విధానంలో చేపల పెంపకానికి సబ్సిడీ రుణాలు అందించనున్నారు. నీటిలో కేజ్ కల్చర్ యూనిట్ నెలకొల్పడానికి ఒక్కో యూనిట్‌కు రూ.3 లక్షల రుణం అందిస్తారు. ఒక్కో మత్స్యకార్మికునికి ఒక్క యూనిట్ చొప్పున ఇవ్వనున్నారు. రూ.3 లక్షల రుణంలో జనరల్, బీసీ కేటగిరీల వారికి 40 శాతం సబ్సిడీ, ఎస్సీ, ఎస్టీ, మహిళలకు 60 శాతం వర్తిస్తుందని అధికారులు వివరించారు. త్వరలోనే మత్స్యకార్మికులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా మత్స్యకార్మికశాఖ అధికారులు తెలిపారు.

మత్స్యకార్మికులను ఆదుకోవాలి



ముంపు గ్రామాల్లో మత్స్యకార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి. ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో ఇతరత్ర పనులు లేక చేపల పెంపకంపైనే అనేక కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. వారికి ఉపాధి కల్పించేందకు ప్రభుత్వం ప్రయత్నించడం మంచి పరిణామం. ముంపు గ్రామాల మత్స్యకార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాలి. – మైలారం శ్రీనివాస్, కొదురుపాక

త్వరలో అవగాహన సదస్సు



మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలతో కేజ్ కల్చర్ విధానంలో చేపల పెంపకంపై ముంపు గ్రామాల మత్స్యకార్మికులతో త్వరలో అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తాం. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులు తీసుకుని రావాలి. కేజ్ కల్చర్ యూనిట్లు మంజూరు చేయిస్తాం.
– శివప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి, సిరిసిల్ల

మత్స్యకార్మికులు వినియోగించుకోవాలి



మిడ్‌మానేరు ముంపు గ్రామాల్లోని మత్స్యకార్మికులకు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలతో కేజ్ కల్చర్ విధానంలో చేపల పెంకంతో ఉపాధి కల్పించేందకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. యూనిట్ స్థాపనకు సబ్సిడీపై రుణం సైతం అందిస్తారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లోని ఆసక్తి గల మత్స్యకార్మికులు ఉపయోగించుకోవాలి.
– మేడిపల్లి సత్యం, చొప్పదండి ఎమ్మెల్యే

ఆకట్టుకున్న ప్రదర్శనలు





వేములవాడ: రాజన్న సన్నిధిలో కొనసాగుతున్న త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. త్యాగరాజ స్వామి జీవిత చరిత్ర, కూచిపూడి నృత్య రూపకం ప్రదర్శించారు. పెద్ద ఎత్తున భక్తులు, స్థానికులు కళాప్రదర్శనలను వీక్షించారు.

రోడ్డుప్రమాదంలో జేఎన్టీయూ విద్యార్థి మృతి


రవితేజ (ఫైల్)

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలం నాచుపెల్లి జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ ఫైనలియర్ విద్యార్థి రవితేజ గురువారం వరంగల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు రాసిన రవితేజ వారం రోజుల క్రితం వరంగల్ వెళ్లాడు. అక్కడ జరిగిన ప్రమాదంలో మృతిచెందడంతో కళాశాలలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

రైలు నుంచి పడి ఒకరు..


గోపాల్‌ఛత్రియా(ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): ప్రమాదవశాత్తు రైలు నుంచి పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం బలంగీర్ జిల్లా భారుపల్లికి చెందిన గోపాల్ ఛత్రియా(43) రాయపూర్ నుంచి సికింద్రాబాద్‌కు పాట్నా–సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌లోని జనరల్ కోచ్‌లో ప్రయాణిస్తుండగా జమ్మికుంట మండలం బిజిగిరిషరీఫ్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు నుంచి పడి మృతిచెందాడు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ పేర్కొన్నారు.

నలుగురిపై వరకట్నం కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో నివసిస్తున్న బత్తుల జ్యోతి ఉరఫ్ వంగల జ్యోతిని అదనపు కట్నం కోసం వేధిస్తున్న ఘటనలో నలుగురిపై శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్సై రమాకాంత్ వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం పెర్కవేడుకు చెందిన జ్యోతి కుటుంబ సభ్యులు రాచర్లబొప్పాపూర్‌లో నివాసం ఉంటున్నారు. జ్యోతిని పెర్కవేడుకు చెందిన వంగల సుమన్ 2023లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. మూడునెలలపాటు వీరి కాపురం సజావుగా సాగింది. తర్వాత సుమన్‌తోపాటు మామ స్వామి, అత్త సుగుణ, బావ సునీల్ కలిసి రూ.10 లక్షల కట్నం తేవాలని జ్యోతిని వేధించడంతో పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదుతో నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

దాడిచేసిన వ్యక్తులపై కేసు

జగిత్యాలరూరల్: సారంగాపూర్ మండలం లక్ష్మీదేవిపల్లికి చెందిన చిరంజీవిపై దాడిచేసిన మహేశ్, అతడి తండ్రి రాజేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. లక్ష్మీదేవిపల్లికి చెందిన మహేశ్ గురువారం తన భార్యను కొడుతుండగా అటుగా వెళ్తున్న చిరంజీవి చూశాడు. మహేశ్ భార్య రక్షించాలని అరవడంతో చి రంజీవి అడ్డుకున్నాడు. దీంతో మనసులో పె ట్టుకున్న మహేశ్, అతని తండ్రి రాజేందర్ శుక్రవారం చిరంజీవిపై కర్రలతో దాడిచేశారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

8న బహిరంగ వేలం

ఇల్లందకుంట(హుజూరాబాద్): మండలకేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఈనెల 8న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి సుధాకర్ పేర్కొన్నారు. మార్చి 1 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు కొబ్బరికాయలు, పూజాసామగ్రి అమ్ముకునేందుకు, కొబ్బరి ముక్కలు పోగు చేసుకునేందుకు హక్కులు పొందేందుకు వేలం నిర్వహించనున్నట్లు వివరించారు.

ఆటో బోల్తా

- ఏడుగురికి గాయాలు


108 వాహనంలో ఏరియా ఆస్పత్రికి తరలింపు

వీర్నపల్లి(సిరిసిల్ల): మండల కేంద్రంలో శుక్రవారం ఆటో బోల్తాపడిన సంఘటనలో ఏడుగురు గాయపడ్డారు. మండల కేంద్రానికి చెందిన గంగాధరి రమేశ్ కుటుంబం తాడూర్‌లోని బంధువుల ఇంటికెళ్లారు. తిరిగి వస్తుండగా అటవీశాఖ గెస్ట్‌హౌస్ వద్ద వారు ప్రయాణిస్తున్న ఆటోను అడవిపంది ఢీకొని బోల్తాపడింది. అందులో ప్రయాణిస్తున్న గంగాధరి అబ్రహం, గంగాధరి నవనీత, గౌరి సత్తవ్వ, జంగం పుష్పలత తీవ్ర గాయాలయ్యాయి. ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి 108లో తరలించారు. ఎస్సై రమేశ్ సంఘటన స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు.

జేసీబీకి ఢీకొని వ్యక్తి దుర్మరణం


భూంరెడ్డి (ఫైల్)

వేములవాడరూరల్: వేములవాడ మున్సిపల్ పరిధి శాత్రాజుపల్లి గ్రామంలో రోడ్డుపై నిలిపి ఉన్న జేసీబీని బైక్‌పై వస్తున్న వ్యక్తి ఢీకొని మృతిచెందాడు. పోలీసులు, గ్రామస్తుల వివరాల ప్రకారం.. బోయినపల్లి మండలం దుండ్రపల్లి గ్రామానికి చెందిన కందుల భూంరెడ్డి (60) తన ద్విచక్ర వాహనంపై వట్టెంల నుంచి వేములవాడకు వస్తున్నాడు. శాత్రాజుపల్లి వద్ద రోడ్డుపై ఆగి ఉన్న జేసీబీని వెనక నుంచి ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రున్ని వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

ఉద్యోగంపై బెంగతో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య


సాగర్‌రెడ్డి (ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): ఉద్యోగంపై బెంగతో ఓ ఇంటర్ విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. ముస్తాబాద్ మండలం మొర్రాయిపల్లెకు చెందిన గూడ సాగర్‌రెడ్డి(18) శుక్రవారం గ్రామ శివారులోని పొలం వద్ద చెట్టుకు ఉరేసుకున్నాడు. గమనించిన చుట్టుపక్కల రైతులు అతడి తల్లిదండ్రులు గూడ సంజీవ్‌రెడ్డి, రేణుకకు సమాచారం అందించారు. వారు వచ్చేసరికి సాగర్‌రెడ్డి విగతజీవిగా మారాడు. ముస్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న సాగర్‌రెడ్డి ఇటీవల ఢిల్లీకి వెళ్లి కంప్యూటర్ కోర్సులో చేరాడు. తిరిగి ఢిల్లీకి వెళ్లే క్రమంలో ఉద్యోగం వస్తుందో.. రాదోననే మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకోవడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. మృతుడి తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కరీంనగర్‌క్రైం: స్థానిక కశ్మీర్‌గడ్డకు చెందిన ఖాసీం(55)పై జనవరి 30న ప్రమాదవశాత్తు శానిటైజర్ మీదపడగా, అప్పుడే బీడీ అంటించుకునే క్రమంలో నిప్పంటుకొని తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు షాహెబ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

రాజన్నకు కోడెమొక్కులు



వేములవాడ: రాజన్నను శుక్రవారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. సమ్మక్క జాతర సమీపిస్తుండడంతో ముందుగా రాజన్నకు మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు భారీగా తరలివస్తున్నారు.

పంచాయతీ ఎన్నికలపై స్పష్టత ఇవ్వాలి


మాట్లాడుతున్న కొండూరి రవీందర్‌రావు

- బీఆర్‌ఎస్ పాలనలో గ్రామీణాభివృద్ధి
- టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

సిరిసిల్లటౌన్: సర్పంచుల పదవీకాలం ముగిసినందున వెంటనే ఎన్నికలు నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనివ్వాలని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు కోరారు. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ పాలనలో సర్పంచుల పదవీకాలం ముగిసి రెండేళ్లు గడిచినా ఎన్నికలు నిర్వహించలేదన్నారు. ఫలితంగా గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత కేసీఆర్ ఎన్నికలు నిర్వహించి గ్రామీణ వికాసాన్ని పెంచారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ గణన చేపడతామంటుందని దీనికి సుమారు ఎనమిది నెలల వ్యవధి పడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సర్పంచుల ఎన్నికలపై వెంటనే స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

చేనేత, జౌళికి నిధుల కొరత

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో చేనేత, జౌళి శాఖలకు తక్కువ నిధులు కేటాయించిందని టీఎస్‌పీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్ అసహనం వ్యక్తం చేశారు. సిరిసిల్ల వస్త్రపరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మాదిరిగానే సిరిసిల్ల నేతన్నలకు ఉపాధి కల్పించేలా ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, కుంభాల మల్లారెడ్డి, దార్నం అరుణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దు

- డాక్టర్ ప్రవీణ్‌కుమార్


మాట్లాడుతున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

సిరిసిల్ల: విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దని మానసిక వైద్యనిపుణులు ప్రవీణ్‌కుమార్ కోరారు. సిరిసిల్ల పట్టణ శివారులోని చంద్రంపేట, చిన్నబోనాల స్కూళ్లలో శుక్రవారం విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై సదస్సులు నిర్వహించారు. డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ పరీక్షల సమయంలో ఆందోళనకు గురికావద్దని, ప్రశాంతంగా పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. మానసిక సమస్యలు ఉంటే 14416 హెల్ప్‌లైన్ నంబర్‌ను వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ ప్రతాపరెడ్డి, చిన్నబోనాల, చంద్రంపేట స్కూల్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, బి.కనకయ్య పాల్గొన్నారు.

బాధ్యత మరిచి.. రోడ్డుపైకొచ్చి !

జిల్లా కేంద్రంలో మైనర్లు ద్విచక్ర వాహనాలు నడుపుతున్నారు. అంతేకాకుండా నిబంధనలు పాటించడం లేదు. ట్రిపుల్ రైడింగ్‌తోపాటు సెల్‌ఫోన్లలో మాట్లాడుతూ ప్రయాణిస్తున్నారు. చాలా మంది హెల్మెట్స్ లేకుండా బైక్‌లపై ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. వారి ప్రాణాలమీదికి తెచ్చుకోవడంతోపాటు ఇతరుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టుతున్నారు. ఒక వైపు జిల్లా పోలీసులు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సులు నిర్వహిస్తుంటే మరో వైపు యువకులు ఇలా బాధ్యత మరిచి రోడ్డుపైకొస్తున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల







హౌసింగ్‌బోర్డు సొసైటీ స్థలాల పరిశీలన


బోర్డును తొలగిస్తున్న అధికారులు

జమ్మికుంట(హుజూరాబాద్): పట్టణంలోని హౌసింగ్‌బోర్డుకాలనీలో సొసైటీ స్థలాలను తెలంగాణ హౌసింగ్‌బోర్డు సొసైటీ వరంగల్ డిప్యూటీ డీఈ రవిప్రసాద్, ఏఈ పృథ్వీరాజ్ శుక్రవారం పరిశీలించారు. మున్సిపల్ అధికారులు (లోకల్‌బాడీస్) కొంత స్థలం మున్సిపల్‌కు చెందిందని అందులో బోర్డు ఏర్పాటు చేయగా, సదరు స్థలం తెలంగాణ హౌసింగ్‌బోర్డు సొసైటీ పరిధిలోనే ఉందని గుర్తించిన సొసైటీ అధికారులు మున్సిపల్ ఏర్పాటు చేసిన బోర్డును తొలగించారు. సొసైటీ అధికారులు మాట్లాడుతూ హౌసింగ్‌బోర్డు కాలనీకి సంబంధించి ఇండ్లను అప్పటి గ్రామ పంచాయతీ(లోకల్ బాడీస్)కి అప్పగించినట్లు తెలిపారు. అవే కాకుండా హౌసింగ్‌బోర్డు కాలనీలో అక్కడక్కడా రోడ్డు, ఖాళీ స్థలాలు ఉన్నాయని, అవి కబ్జాకు గురైనట్లు ఫిర్యాదులు వచ్చాయని, వాటిని కాపాడాల్సిన బాధ్యత లోకల్‌బాడీస్ అధికారులపై ఉందన్నారు.

కాంగ్రెస్ ఎంపీ టికెట్‌కు దరఖాస్తులు


దరఖాస్తు చేస్తున్న రాజేందర్‌రావు

కరీంనగర్‌కార్పొరేషన్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి కరీంనగర్ టికెట్ ఆశిస్తున్న నాయకులు దరఖాస్తు చేస్తున్నారు. పార్లమెంట్‌కు పోటీచేసే ఆశావహుల నుంచి కాంగ్రెస్ దరఖాస్తులు ఆహ్వానించడం తెలిసిందే. రూ.50 వేల రుసుముతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ మూడురోజుల క్రితం ప్రారంభమైనా, మొదట్లో కరీంనగర్‌కు దరఖాస్తులు రాలేదు. కానీ శుక్రవారం కరీంనగర్ టికెట్‌ను ఆశిస్తూ పలువురు ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సీనియర్ నేత, దివంగత వెలిచాల జగపతిరావు తనయుడు వెలిచాల రాజేందర్‌రావు, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, ప్రస్తుతం యూఎస్ఏలో నివాసముంటున్న నగరంలోని వావిలాపల్లికి చెందిన సింగిరెడ్డి సుమనరెడ్డి దరఖాస్తు చేసుకున్నారు.